సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం : 26 : జనవరి : 2023



890 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో 1, 2 యూనిట్ల నుంచి 890 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు బుధవారం తెలిపారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,270
3 శాతం జీఎస్టీతో	రూ.5,428
నవర (8 గ్రా)	రూ.43,424

గరిష్టం/కనిష్టం
30.7 /21.7

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతమయ్యే అవకాశం. గాలిలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రైల్వే సేఫ్టీ చీఫ్ కమిషనర్ తనిఖీ



ట్రాక్ పటిష్టతను తనిఖీ చేస్తున్న రైల్వే భద్రతా విభాగం ప్రధాన కమిషనర్ ఆర్కే శర్మ

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో రైల్వే భద్రతా విభాగం ప్రధాన కమిషనర్ ఆర్కే శర్మ బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సాధారణ వార్షిక తనిఖీల్లో భాగంగా బిట్రగుంట–అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. రైల్వే ట్రాక్ పటిష్టత, మూడో లైన్ పనులు, 141 నంబరు రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు, 443వ నంబరు రైల్వే బ్రిడ్జి తదితర అంశాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. అదే విధంగా బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో కీలకమైన క్రూ లాబీ, ఎంఆర్‌వీ విభాగాలు, నిర్వహణకు సంబంధించిన అంశాలు పరిశీలించారు. రైల్వే భద్రతా పరంగా పలు అంశాలపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఉన్నారు.

జగనన్న చేదోడుకు నేడు ఆఖరి గడువు

నెల్లూరు (అర్బన్): జగనన్న చేదోడు పథకం ద్వారా రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్స్‌కు అర్హులైన వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయం ముఖ్యమంత్రి అందించేందుకు దరఖాస్తు చేసుకునే గడువు గురువారంతో ముగియనుందని కలెక్టర్ చక్రధర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులైన వారుంటే తక్షణమే వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే రెండు దఫాలు రూ.10 వేలు వంతున ఆయావర్గాల ప్రజల వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేసిందన్నారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వారికి మూడో విడత కింద కూడా రూ.10 వేలు చొప్పున త్వరలోనే ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించండి
- రైతులకు మద్దతు ధర లభించాలి
- జేసీ కూర్మనాథ్



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు (పొగతోట): ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడి రైతులను నష్టపరిచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ హెచ్చరించారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణపై ఏఎస్‌ఓలు, సీఎస్‌డీటీలు, టెక్నికల్ అసిస్టెంట్స్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, డేటాఎంట్రీ ఆపరేటర్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. వచ్చే నెల నుంచి వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర కంటే తక్కువగా ధాన్యం కొనుగోలు చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు నష్టపోకుండా దళారులు, రైస్ మిల్లర్ల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తామన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం సేకరణ సమయంలో టెక్నికల్ అసిస్టెంట్ రైతు సమక్షంలో అనాలసిస్ చేసి దానికి సంబంధించిన వివరాలతో ఫొటో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ధాన్యం వాహనం లోడ్ చేసిన తర్వాత తూకం వేసి ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. వాహనం రైస్‌మిల్లుకు చేరిన తర్వాత అక్కడ ఉన్న అధికారి పరిశీలించి ధాన్యం అన్‌లోడ్ చేయించి దానికి సంబంధించిన ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి ధాన్యం తరలించడంలో రైస్ మిల్లర్ ప్రమేయం ఉండకూడదన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల నుంచి రైతులు ధాన్యాన్ని సొంత ఖర్చులతో లారీల ద్వారా పంపిస్తే దానికి సంబంధించిన నగదును వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బందులు పెట్టే వారిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎస్‌ఓ టి.వెంకటేశ్వర్లు, లీగల్ మెట్రాలజీ ఏసీ ఈశ్వర్‌రావు, వ్యవసాయశాఖ అధికారి వై రాధా, ఏఎం ఇబ్రాహీం, ఏఎస్‌ఓ డీఈ అంకయ్య, సీఎస్ డీటీలు పాల్గొన్నారు.

బాబొస్తే పథకాలు రద్దే

- సంక్షేమ పథకాలపై చంద్రబాబుది పూటకోకమాట
- మతిభ్రమించి మాట్లాడుతున్న చంద్రబాబు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: చంద్రబాబును గెలిపిస్తే సంక్షేమ పథకాలు రద్దయిపోతాయని, చంద్రబాబే అనేక సందర్భాల్లో బాహాటంగా చెప్పారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పలు సందర్భాల్లో జగన్ ప్రభుత్వం ప్రజలకు పప్పులు, బెల్లాల్లా నగదు పంచి పెడుతుందని మాట్లాడాడని గుర్తు చేశారు. మండలంలోని దుగ్గుంట సచివాలయ పరిధిలో బుధవారం దుగ్గుంటరాజుపాళేం, పక్కిమడ గ్రామాల్లో మంత్రి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సుపరిపాలన చూడలేక, రాజకీయ భవిష్యత్ ఉండదనే ఉద్దేశంతో చంద్రబాబు మతిభ్రమించి విమర్శలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున ప్రభుత్వం దివాలా తీసిందని చెబుతున్న బాబు తాను అధికారంలోకి వస్తే ఇంతకంటే మెరుగ్గా పథకాలను అమలు చేస్తానని మరోసారి ప్రకటించడం వెనుక తిరిగి ప్రజలను మోసగించాలనే ఆలోచన ఉందన్నారు. ప్రజలు బాబు మోసపూరిత మాటలను నమ్మి తిరిగి ఆయన్ను అధికారంలోకి తెచ్చుకునే పరిస్థితిలో లేరని, మరొక్కమారు ఆయనకు శృంగభంగం తప్పదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలే ఆయనకు శ్రీరామరక్షగా పనిచేసి ప్రజలు ఓట్లు వేసి తిరిగి అధికారంలో కూర్చోబెడతారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో అభివృద్ధి శిలాఫలాలకే పరిమితం అయిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేసి గ్రామాలకు రోడ్లు వేయించినట్లు తెలిపారు. సాగునీటిని అందించేందుకు అవకాశం లేని ముదిగేడు, కల్యాణపురం, ముత్యాలపేట, ఇనుకుర్తి, మర్రిపల్లి, పార్లపల్లి, చెర్లోపల్లి తదితర గ్రామాలకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రారంభోత్సవాలు

దుగ్గుంటరాజుపాళేంలో సైడ్ డ్రెయిన్లు రూ.66 లక్షలు, సిమెంట్ రోడ్లు రూ.1.40 కోట్లతో పూర్తయిన పనులను మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం చినబ్రహ్మయ్య, మండల సచివాలయాల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటరమణయ్య, ఎంపీటీసీ కేతు రామిరెడ్డి, నాయకులు ఎం.మోహన్‌రాజు, ఎం.సుందరయ్య, సుధాకర్‌రెడ్డి, జనార్దన్‌రాజు, ఎం.జనార్దన్ పాల్గొన్నారు.

కోడిగుడ్ల కోసం సోమిరెడ్డి, అజీజ్ వీరంగం

- ప్రైవేట్ కేసు వేస్తామంటూ హంగామా



నెల్లూరు (మినీబైపాస్): రూ.150 విలువ చేసే కోడిగుడ్ల కోసం మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వీరంగం చేశారు. కోడిగుడ్లు తీసుకున్న మహిళపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టుకు వెళ్తామంటూ పోలీసుల్ని హెచ్చరించారు. కోడిగుడ్ల వ్యవహారంపై పోలీసుస్టేషన్‌లో టీడీపీ నేతల నానా హంగామా చూసి పోలీసులు, జనం సైతం నివ్వెరపోయారు. రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడుకు చెందిన ఒక అంగన్‌వాడీ కార్యకర్త కొన్ని కోడిగుడ్లను తీసుకు వెళుతుందని, స్థానికంగా ఒక టీడీపీ మహిళ ప్రశ్నించడంతో ఈ వ్యవహారం పోలీసుస్టేషన్‌కు చేరింది. అంతలోనే సోమిరెడ్డి, అబ్దుల్‌అజీజ్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు ఎంత సర్దిచెబుతున్నా.. వినకుండా నానా హంగామా చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకోకపోతే ప్రైవేట్ కేసు వేస్తామని, హైకోర్టుకు కూడా వెళ్తామని చెప్పడంతో పలువురు నవ్వుకుంటున్నారు. ఇంత చిన్న విషయాన్ని సోమిరెడ్డి రాద్ధాంతం చేయడంతో 'ఇదేం ఖర్మరా' బాబు అంటూ పలువురు ముక్కున వేలేసుకున్నారు.

గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్, ఎస్పీ



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ చక్రధర్‌బాబు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు (అర్బన్)/నెల్లూరు (క్రైమ్): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, అప్పటి జేసీ హరేందిర ప్రసాద్ బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టిసెస్ అవార్డు–2022ను అందుకున్నారు. ఆత్మకూరు ఉపఎన్నికల్లో వ్యయ నియంత్రణ, సాంకేతిక, భద్రత, పోలింగ్ స్టేషన్ల వద్ద మంచి సౌకర్యాల కల్పన, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయడం, వృద్ధులకు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం, పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్‌ల నిర్వహణ తదితర పలు అంశాల్లో ఉత్తమ సేవలందించినందుకు ఈ అవార్డును ప్రభుత్వం కలెక్టర్‌కు అందించింది. గతేడాది ఆత్మకూరు ఉప ఎన్నికల సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక, సాధారణ పోలింగ్ స్టేషన్లను గుర్తించి తదనుగుణంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. చిన్నపాటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలు, బాడీవార్న్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్ల బైండోవర్, ఆయుధాలు డిపాజిట్‌తో పాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించారు. అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్/ఏపీఎస్‌పీ/సాయుధ బలగాలతో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. కలెక్టర్ సిఫార్సుల మేరకు అప్పుడు రిటర్నింగ్ అధికారిగా జిల్లాలో పనిచేసిన నాటి జేసీ హరేందిరప్రసాద్, ఎస్పీ విజయారావు సైతం గవర్నర్ ప్రత్యేక పురస్కారాలు అందించారు.

27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌కు అవకాశం

నెల్లూరు (టౌన్): 2022–24 విద్యా సంవత్సరానికి బీఈడీ ఎంట్రన్స్ రాసిన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదుకు అవకాశం ఉందని ప్రభుత్వ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 94412 46195 నంబరులో సంప్రదించాలన్నారు.

గడప గడపకు వందరోజుల వేడుకలు



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

- సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ఒక చరిత్ర
- దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు
- సంక్షేమ పథకాలు సీఎం జగన్ మానసపుత్రికలు
- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక గొప్ప ఆలోచనతో ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్య ఉండే విధంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఎమ్మెల్యేలుగా ప్రజలతో మమేకం అయ్యే అవకాశాన్ని కల్పించారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి వంద రోజులు పూర్తయిందన్నారు. పడుగుపాడు సచివాలయం– 2 పరిధిలో బుధవారం వంద రోజుల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 48 వేల గడపలను తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నామన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేసి కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ చరిత్ర అన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల నిధులు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ముఖ్యమంత్రి బటన్ నొక్కితే వారి ఖాతాలో డబ్బులు జమయ్యే విధంగా చేయడం గొప్ప విజన్ అన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున రూ.10 కోట్ల మేరకు అత్యవసర పనులు చేశామన్నారు.

100 బెలూన్లు, 100 మంది మహిళలతో హారతులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి వంద రోజులు పూర్తి చేసుకొన్న సందర్భంగా పడుగుపాడు క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 100 మంది మహిళలతో హారతులు ఇవ్వడం 100 బెలూన్లు గాలిలోకి వదలడం డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ఆధ్వర్యంలో శత దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. ఎంపీడీఓ శ్రీహరి ఆధ్వర్యంలో పడుగుపాడు 1, 2, 3 వలంటీర్ల ఆధ్వర్యంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీ షీల్డ్‌ను ఆయనకు అందజేశారు. అనంతరం భారీ కేక్ ఏర్పాటుచేసి ఆయన కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే తనయుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ సుప్రజ, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దినేష్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ చలపతిరావు, అహమ్మద్, నవీన్‌కుమార్‌రెడ్డి, అల్లాభక్షు, నరసింహులురెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత ఉన్నారు.

నేడు గణతంత్ర సంబరం

- పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో విస్తృత ఏర్పాట్లు
- ప్రభుత్వ కార్యాలయాల ముస్తాబు


కలెక్టరేట్‌కు విద్యుద్దీపాలతో అలంకరణ


వేడుకలు జరిగే పోలీస్ పరేడ్‌గ్రౌండ్


శకటాన్ని తయారు చేస్తున్న దృశ్యం

నెల్లూరు(అర్బన్): గణతంత్ర సంబరానికి నెల్లూరులోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్ సిద్ధమైంది. గురువారం వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మదినిండా జాతీయభావం ఉప్పొంగేలా గ్రౌండ్‌ను తీర్చిదిద్దారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కేవీఎన్ చక్రధర్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం ఎస్పీ విజయారావు ఆధ్వర్యంలో పోలీస్ వందనం స్వీకరిస్తారు. తర్వాత జిల్లా ప్రగతికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని కలెక్టర్ వివరిస్తారు. ఆయా శాఖలు ప్రగతి శకటాలను ప్రదర్శిస్తాయి. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి అవార్డులు అందజేస్తారు. స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తారు. ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను ఇస్తారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ భవనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అక్కడి ఆవరణలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండా పతాకావిష్కరణ చక్రధర్‌బాబు చేతుల మీదుగా జరుగుతుంది. అలాగే డీఆర్‌డీఏ, ట్రెజరీ తదితర కార్యాలయాలను ముస్తాబు చేశారు.

750 మందికి పురస్కారాలు

అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి జిల్లాలో తొలిసారిగా పెద్దసంఖ్యలో 750 మంది అధికారులు, సిబ్బందికి పురస్కారాలను కలెక్టరేట్ అధికారులు ప్రకటించారు. ఇందులో 46 మంది జిల్లాస్థాయి అధికారులున్నారు. వారిలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, ఏపీ జెన్కో చీఫ్ ఇంజినీర్ నాగరాజు, కావలి ఆర్డీఓ శీనానాయక్, కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, సెట్నల్ సీఈఓ పుల్లయ్య తదితరులున్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి 46 మంది, నెల్లూరు డివిజన్ రెవెన్యూ శాఖ నుంచి 19 మంది, కావలి డివిజన్ నుంచి 22 మంది, కందుకూరు డివిజన్ నుంచి 27 మంది, ఇంకా అధికారులు, సిబ్బంది పురస్కారాలు తీసుకునే జాబితాలో ఉన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

- జేసీ కూర్మనాథ్
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న జేసీ కూర్మనాథ్, కమిషనర్ హరిత, డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు(అర్బన్): 'యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. దేశ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది.' అని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ కూర్మనాథ్ మాట్లాడుతూ యువత భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్య విలువలను కాపాడగలమని తెలిపారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై, ఎన్నికల ప్రక్రియపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం బాధాకరమన్నారు. సీనియర్ ఓటర్లు కేవీ చలమయ్య, అరుణాచలం, కాశేశ్వరరావు, ఛాన్‌బాషా, కృష్ణమూర్తి, అరుణమ్మను సత్కరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఓటు నమోదు ప్రక్రియ, జాబితా సవరణ ప్రక్రియలో విశేష కృషి చేసిన 24 మంది బూత్‌లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు)కు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హరిత, ఆర్డీఓ మలోల, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి మధుబాబు, డీకెడబ్ల్యూ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్) : 107	బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 212
లేయర్ (లైవ్) : 95	
బ్రాయిలర్ చికెన్ : 190	లేయర్ చికెన్ : 162

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5

నాణేలపై స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాలు


ఉజ్వల



నెల్లూరు(అర్బన్): నెల్లూరుకు చెందిన ఎస్.ఉజ్వల ఖ్యాతి నాణేలపై స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాలను వేసింది. రిపబ్లిక్‌డే సందర్భంగా 74 నాణేలపై 74 మంది సమరయోధుల చిత్రాలను వేసి పులి బొమ్మపై అతికించింది. ఒక్కో చిత్రాన్ని వేసేందుకు 10 నిమిషాల సమయం పట్టిందని బుధవారం తెలిపింది.

అధికారులకు అవార్డులు

నెల్లూరు(క్రైమ్): పోలీసు, సెబ్, ఫైర్, సీఐడీ, జైళ్లు, ఆర్టీసీ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి అవార్డులు లభించాయి. జిల్లా సెబ్ అధికారిణి కె.శ్రీలక్ష్మి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, కె.శ్రీకాంత్‌రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి, ఎస్ఈబీలో నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ కేపీ కిశోర్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగేశ్వరమ్మ, డీఎస్ఈఓ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ హెచ్ఎస్ హుస్సేన్‌బాషా, సీఐడీలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, జైళ్ల శాఖలో జిల్లా కేంద్ర కారాగారం ఉపపర్యవేక్షణాధికారి ఏబీ కాంతరాజు, జైలర్ వి.రమేష్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ సీహెచ్ నిరంజన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై (ఐఎంఎల్ డిపో) సీహెచ్ పూర్ణకుమార్, ఏపీపీటీడీలో నెల్లూరు టూ డిపో డీఎం ఎం.శివకేశవ యాదవ్, అసిస్టెంట్ మేనేజర్ కేవీ రమణ తదితరులు అవార్డులు అందుకోనున్నారు.

తండ్రి చేతిలో కొడుకు హతం

- వలేటివారిపాళెం మండలంలో ఘటన
- చెట్టుపై నుంచి పడ్డాడని కేసు నమోదు చేసేందుకు పోలీసుల యత్నం
- ఎస్పీ దృష్టికి విషయం
- విచారణ చేపట్టిన పోలీస్ ఉన్నతాధికారులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుదర్శన్

కందుకూరు: కన్న కొడుకుని తండ్రి హత్య చేశాడు. ఈ కేసును పక్కదారి పట్టించేందుకు వలేటివారిపాళెం పోలీసులు చేసిన ప్రయత్నం వికటించింది. హత్య కేసును సాధారణ ప్రమాద కేసుగా నమ్మించాలని చూశారు. చివరికి అసలు విషయం బుధవారం బయట పడింది. ఆగమేఘాల మీద పోలీస్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.

అసలేం జరిగిందంటే..

వలేటివారిపాళెం మండలం అత్తింటివారిపాళేనికి చెందిన నడిపినేని మాలకొండయ్య, రమేష్ (39) తండ్రీకొడుకులు. రమేష్ జులాయిగా తిరుగుతున్నాడు. వివాహమైనా చాలాకాలంగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఇటీవల ఇంటికొచ్చిన రమేష్ తాను సహజీవనం చేస్తున్న మహిళను తీసుకొస్తానని తండ్రికి చెప్పాడు. ఆయన ఇష్టం లేదని చెప్పని వారిద్దరి మధ్య వాదన జరిగింది. మంగళవారం మధ్యాహ్నం తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సహనం కోల్పోయిన మాలకొండయ్య గొడ్డలితో రమేష్‌పై దాడి చేశాడు. దీంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

కథ అల్లిన పోలీసులు

ఈ కేసు నుంచి బయటపడేయాలని మాలకొండయ్య, ఆయన తరఫు బంధువులు వలేటివారిపాళెం పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారు కేసును మాఫీ చేసేందుకు పెద్ద కథ అల్లారు. మంగళవారం గ్రామంలో ఓ వ్యక్తి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. అలాగే అదే ఊర్లో నడిపినేని గోవిందయ్య అనే రైతు పొలంలో ఉన్న చెట్టు కొట్టేందుకు పోకూరు గ్రామానికి చెందిన ఎం డ్లూరి బాబు వెళ్లాడు. బాబు చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. అతడిని బంధువులు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. కొంచెం అటూఇటూగా జరిగిన ఈ రెండు ఘటనలను పోలీసులు ముడిపెట్టే ప్రయత్నం చేశారు. తండ్రి చేతిలో హతమైన రమేష్ చెట్టు పైనుంచి పడిపోయినట్లు చిత్రీకరించారు. ఈ మేరకు వలేటివారిపాళెం ఎస్సై మంగళవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు.

మహిళ ఫిర్యాదుతో..

రమేష్, తాను రహస్యంగా పెళ్లి చేసుకున్నామని, ప్రస్తుతం తమకు ఒక బిడ్డ కూడా ఉందని సహజీవనం చేస్తున్న మహిళ పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. రమేష్‌ను తండ్రే చంపేశాడని ఫిర్యాదు చేసింది. ఇదే సమయంలో ఆమెను రమేష్ బంధువులు బెదిరించారు.

పోస్టుమార్టం చేయించి..

జరిగిన విషయం బయటపడకుండా పోలీసులతో పాటు, బంధువులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆగమేఘాల మీద కందుకూరు ఏరియా హాస్పిటల్‌కు మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం చేయించారు. రాత్రే గ్రామంలో అంత్యక్రియలు చేశారు.

ఎస్పీ దృష్టికి..

పోలీసులు ఆడిన ఈ డ్రామా మొత్తం ఎస్పీకి చేరినట్లు సమాచారం. దీంతో మంగళవారం అర్ధరాత్రి రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు కేసును మార్చినట్లు తెలిసింది. ఈ హత్యతో ప్రమేయం ఉన్న రమేష్ తండ్రి మాలకొండయ్యతోపాటు, ఇతర బంధువులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం గుడ్లూరు సీఐ సుబ్బారావు పోలీస్‌స్టేషన్‌లోనే ఉండి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసు నమోదు చేశాం

ఈ ఘటనపై గుడ్లూరు సీఐ సుబ్బారావును వివరణ కోరగా సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు. హత్య కేసును ప్రమాదంగా ఎందుకు చూపించారని ప్రశ్నించగా సమాధానం చెప్పలేదు. ప్రస్తుతం హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించండి

- జిల్లా సెబ్ అధికారి శ్రీలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

నెల్లూరు(క్రైమ్): ఇసుక అక్రమ రవాణా, మద్యం అనధికార విక్రయాలకు పాల్పడే అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా సెబ్ అధికారి కె.శ్రీలక్ష్మి ఆదేశించారు. నెల్లూరులోని పోలీసు కార్యాలయంలో ఉన్న మినీ కాన్ఫరెన్స్‌హాల్లో బుధవారం ఆమె సిబ్బందితో నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలు, పెండెన్సీకి గల కారణాలను ఆరాతీశారు. నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పొరుగు మద్యం, గంజాయి రవాణా, విక్రయాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఎర్రచందనం, నాటుసారా తయారీ, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. కేసుల నమోదుతో సరిపెట్టుకోకుండా మూలాల ఏరివేతకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పదే పదే నేరాలకు పాల్పడుతున్న నిందితులను బైండోవర్ చేయాలన్నారు. అప్పటికీ మార ని పక్షంలో సస్పెక్టెడ్ షీట్లు తెరవాలన్నారు. సెబ్ టోల్‌ఫ్రీ నంబర్ 14500పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో, స్థానిక పోలీసుల సహకారంతో చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. సమావేశంలో సెబ్ ఇన్‌చార్జ్ ఏసీ రవికుమార్, నెల్లూరు ఏఈఎస్ కృష్ణకిశోర్ రెడ్డి, సెబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేశారంటూ మహిళ డ్రామా

- తనను బంధించారంటూ కంట్రోల్‌రూమ్‌కు ఫోన్
- జల్లెడ పట్టిన పోలీసులు
- ఇంట్లోనే ఉన్న మహిళ

కావలి: 'నన్ను కిడ్నాప్ చేశారు. కాపాడండి.' అని మహిళ పోలీసులకు చేసిన ఫోన్‌కాల్ మంగళవారం రాత్రి కలకలం సృష్టించింది. చివరకు ఆమె డ్రామా ఆడినట్లు నిర్ధారించారు. పోలీసుల కథనం మేరకు.. ఓ మహిళ తనను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి గదిలో బంధించారని రాత్రి ఎనిమిది గంటల సమయంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసింది. వారు వెంటనే కావలి పోలీసులను అప్రమత్తం చేశారు. ఒకటో పట్టణ సీఐ, ఎస్సైలు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. ఎస్పీ ఆదేశాలతో బృందాలుగా విడిపోయి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గాలించారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. మరోవైపు బాధిత మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ మరిన్ని వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. కొంతసేపటి తర్వాత ఆమె తనను నెల్లూరుకు తీసుకెళ్తున్నారని చెప్పడంతో పోలీసులు వాహనాల తనిఖీ కూడా చేపట్టారు. మరోవైపు మహిళ కాల్ డేటా ఆధారంగా మరిన్ని వివరాలు సేకరించారు. ఆమెను గుడ్లూరు వాసిగా గుర్తించారు. భర్త నుంచి విడిపోయి కావలిలో అద్దె గదిలో ఉంటోందని, ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడి ఇంట్లో వంటమనిషిగా పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మహిళ గది చిరునామా తెలుసుకుని అక్కడికెళ్లారు. ఫోన్ చేసిన మహిళ ఇంట్లోనే సురక్షితంగా ఉంది. దీంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో సదరు మహిళకు మైదుకూరులో ప్రియుడు ఉన్నాడు. అతను కొంతకాలంగా ఆమెతో మాట్లాడటం లేదు. కిడ్నాప్ పేరుతో హడావుడి చేస్తే అతను అందుబాటులోకి వస్తాడని ఆమె భావించింది. అందుకే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తనను కిడ్నాప్ చేశారని చెప్పి డ్రామా ఆడింది. ప్రియుడితో పోలీసులు మాట్లాడగా ఆమెతో సంబంధం లేదని చెప్పాడు. తమను తప్పుదోవ పట్టించిన మహిళకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు.